

# వఠిపేటి నాగ. చంద్రావతి

తింటున్న చింతపండు, పువ్వు పళ్ళెం చటుక్కున పక్కకు తోసి "రా పద్మా" అని ఆహ్వానించింది పిన్ని. మళ్ళీ నీళ్ళోసుకుంది గావును పిన్ని, అమ్మతో చెప్పాలి, అనుకున్నా. వంటింట్లో పీటవాల్చి "కూర్చో, గమ్మున బియ్యం కడుక్కొస్తా. కుంపటి మీద పడేసి కూచోవచ్చు" అంటూ గిన్నె తీసుకుని దొడ్లోకి వెళ్ళింది పిన్ని.

నా చూపంతా చింతపండు పళ్ళెం మీదనే వుంది. పిన్ని ఎప్పుడూ నీళ్ళు పోసుకోవటమే గాని అవి పాలు అయ్యేదీ లేదు, అయినా కడుపు పంట నాలుగు కాలాల పాటు కళ్ళ ఎదట పారాడిందీ లేదు. అందుకే అమ్మ అంటూ వుంటుంది. "పెళ్ళయితే పెద్దాళ్ళు అన్యాయం చేసి రెండో పెళ్ళి వాడికిచ్చారన్నావ్, మరి దీనికేమి చెబుతావ్? పిచ్చిదానా! రాతే! రాత! ఆ భగవంతుడు రాసిన రాతని ఎవరు తప్పించ గలరు? మనం కేవలం నిమిత్తమాత్రులం" అంటుంది. అమ్మది మరీ వాదస్తం! మానవుల దయితేనేం, భగవంతుడి దయితేనేం, మొత్తానికి అమాయకురాలైన పిన్నికి అంతా అన్యాయమే జరుగు తోంది.

బియ్యం గిన్నెతో లోపలి కొస్తూ "ఏమిటి ఆలోచిస్తున్నావ్" అంది పిన్ని. "అబ్బే ఏం లేదు" అన్నాను. బియ్యం గిన్నె కుంపటి మీద పడేసి, అత్తెసరు నీళ్ళు పోసి పైన పళ్ళెం బోర్లించింది.

"పద మల్లె మొగ్గలు కోద్దాం" చెంబులో నీళ్ళు పోసి వాకిట్లోకి నడుస్తూ అంది. మాట్లాడకుండా వెనకాల నడిచాను. పిన్ని పువ్వులుకోస్తూంటే నేను మాలకడ్తూ అడిగాను, "వాణి దగ్గర్నించి వుత్తర మొచ్చి చాన్నాళ్ళయింది కదు పిన్నీ?"

"మరే — బొత్తిగా మానేసింది మధ్య— కొత్త స్నేహితుడు దొరికాడు కదూ— పాత వాళ్ళని మరిచి పోతున్నట్టుంది" నవ్వింది. నేనూ నవ్వేశా.

వాణి పిన్నికి సవతి కూతురు. అదీ నేనూ ఒకే క్లాసు చదువు కుంటూ ఉండే వాళ్ళం. క్రిందటేడే పెళ్ళయి అత్తవారింటికి వెళ్ళింది వాణి. అది వున్నప్పటి స్నేహమే పిన్నికీ నాకూ.

మల్లె మొగ్గలు ఎవరెవరి కిచ్చిందో, ఇంకా ఎవరి కివ్వాలో చెప్తూంది పిన్ని. అన్నిటికీ వూ కొడుతున్నా.

పచ్చగా వుంటుంది పిన్ని. బారెడు జడ. నీడలు కనిపించే బుగ్గలు. అందమంతా వాటిల్లోనే వుందనిపించే చేపల్లాంటి కళ్ళు. దేవుడికి బుద్ధి లేదనిపించింది మేస్టారి పక్కన అవిణ్ణి వూహించుకుంటే. కాని కలలో కూడా ఆ విషయం అనుకున్నట్టే తోచదు పిన్ని తరహా చూస్తే. కట్టిన మాలలో సగం నా జడలో పెట్టి మిగతాది తన తలలో తురుముకుంది.

"ఇక వెడతా పిన్నీ" అన్నా లేస్తూ.

"కూచుందూ ఒక్కదాన్నీ వుండాలి. మేస్టారొచ్చాక వెడుదువు గానిలే" మళ్ళీ కూచోబెడుతూ అంది పిన్ని— "పొద్దు పోతే మీ వీధి దాకా దిగబెడతాలే."

"భయానికి కాదుగాని— అమ్మేమయినా....." అందుకుంటూ అంది పిన్ని "కోప్పడుతుందనా? రేపు నేనొచ్చి చెప్తాలే— మీ అమ్మాయిని కొట్టకండి— నేనే వుంచేశానూ అని" దీర్ఘం తీస్తూ నవ్వింది పిన్ని.

"మరే— చిన్న పిల్లని గదూ" పకపకా నవ్వాన్నేను.

మాటల్లో పడి పొద్దెంత పోయిందీ తెలియనే లేదు మాకు, కిర్రుమంటూ గేటు తోసుకొస్తున్న మాస్టార్ని చూసేవరకూ. "అరుగో మేస్టారొస్తున్నారు— నే పోతున్నా పిన్నీ" లేచి నిలబడ్డాను. లోపలికి వస్తూ అన్నారు మాస్టారు—

"ఎవరూ? పద్మేనా! నీ స్నేహితురాలు ఉత్తరం రాసిందోయ్."

"ఏం రాసిందండీ?" పిన్నితో బొట్టు పెట్టించుకుంటూ అడిగా.

"కులాసాగానే వున్నారట. మిమ్మల్నందర్నీ చూడాలని వుందటా— సంక్రాంతికి వచ్చి తీసికెళ్లమని రాసింది."

"నా సంగ తేమీ రాయలేదా? రాయదులెండి. దానికి నేను జ్ఞాపక ముంటే కదూ" నవ్వుతూనే అన్నా, లోపలేదో బాధగానే వుంది.

"మరే నీకు మహ అది జ్ఞాపకముందీ? నీ అంతట నువ్వు ఒక్క ఉత్తరం ముక్క రాశావా దానికి చెబుదూ? అది వెళ్ళాక నువ్వూ— మీ పిన్నీ— ఈ ప్రపంచంలోనే పడిపోయావుగానీ— "కూతుర్ని వెనకేసుకొస్తూ అన్నారు మాస్టారు.

"మీరు భలే వారండీ" బయట కొచ్చేస్తూ అన్నా.

"రేపు మీ చెల్లెల్ని పంపు పద్మా పొట్లకాయలిస్తాను" అంటున్న పిన్నికి "ఆ—ఆ" అంటూ సమాధానం చెబుతూ అడుగులు తొందరగా వేశాను.

మేస్టారన్న మాట నిజమే. వాణి అత్తారింటికి వెళ్ళేదాకా పిన్నికీ నాకూ మధ్య వట్టి పరిచయం లాగే వుండేది. వాణితోపాటు నేనూ 'పిన్నీ' అని అవిణ్ణి పిలిచే-న్ని. అంతే. వాణి అత్తవారింటికి వెళ్ళేక ఏమీ తోచక అల్లాడే నన్ను అదే స్థితిలో వున్న పిన్ని పూర్తిగా ఆకర్షించింది. ప్రతిరోజూ సాయంత్రం కాస్సేపు పిన్నితో కబుర్లు చెప్పుకోనిదే తోచదు నాకు. ఎక్కడికీ పంపనిదైన, అమ్మకూడా నన్ను వాళ్ళింటికి వెళ్ళేందుకు అభ్యంతర పెట్టేది కాదు. అలా అని రోజూ పంపేదీ కాదు. నేను వెళ్ళని నాడు రెక్కలు కట్టుకు వాలేది పిన్ని. వాణి దగ్గర కంటే పిన్ని దగ్గరే ఎక్కువ చనువైంది నాకు. వాణి తత్వం కాస్త హడావిడి. అది నా స్వభావానికి విరుద్ధం. పిన్ని మంచి నెమ్మది మనిషి. అందుకే అవిడంటే చనువుతోపాటు గౌరవం గూడా వుండేది నాకు.

"ఇంత ఆలస్యమైందేమే?" నేను వస్తూనే అడిగింది అమ్మ.

"వాణి దగ్గర్నించి ఉత్తర మొచ్చిందేమో అని మాస్టారొచ్చేదాకా వున్నా" అబద్ధానికి నిజం జోడిస్తూ అన్నాను.

"వొచ్చిందా?" పీట వాలుస్తూ అంది అమ్మ.

"వొచ్చింది. కులాసానేట" కంచం పెట్టుకుని పీటమీద కూర్చున్నా.

"అంతేనా? నీళ్ళేమన్నా—?....." నా మొహంలోకి నవ్వుతూ చూస్తూ అంది అమ్మ, నెయ్యి విదుపుతూ.

"దానికేమీ లేదుగాని పిన్నే....." జ్ఞాపకమొచ్చిన సంగతి చెప్పేశా చిరునవ్వుతో మిళాయించి.

"సర్లే. మళ్ళీ అప్పుడేనా" గప్పున మూతి ముడిచింది అమ్మ.

అల్లాంటప్పుడే అమ్మను చూస్తే నాకు మండుతుంది. ఏడాది బిడ్డను పోగొట్టుకుని ఏడాది దాటిన పిన్నికి అప్పుడేనా అంటుంది గాని, విన్నగాక మొన్న కాపురానికి వెళ్ళిన వాణి నీళ్ళోసుకోలేదని తొందరపడుతుంది. అయినా అమ్మకి వాణి అంటేనే పక్షపాతం. అవును మరి. తల్లిపోయిన కొత్తల్లోనూ, తండ్రి మళ్ళీ పెళ్ళి చేసుకున్న సందులోనూ ఎప్పుడూ మా ఇంటి దగ్గరే వుండేది వాణి.

"ఆ ఇంట్లో ఒక్కదాన్నీ వుండాలంటేనే భయమేస్తూందండీ దొడ్డమ్మగారూ" అనే వాణి మాటలకి కన్నీటి చెలమలే అయ్యేవి అమ్మకళ్ళు. వాణి తల్లీ, అమ్మా మంచి స్నేహితులు. అవిణ్ణి తలుచుకుని అప్పుడప్పుడూ అమ్మ బాధపడుతూ వుండేది.

ప్రొద్దున్నే ఎలాగో ఒకలా వంటచేసి, తండ్రిని స్కూలుకు పంపి, తానింత తిని మా ఇంటికి పరుగెత్తుకు వచ్చేది వాణి. ఇద్దరం కలిసే స్కూలుకు వెళ్ళేవాళ్ళం. సాయంత్రం దాకా అదో ప్రపంచం. సాయంత్రం వస్తూనే నన్ను తోడు తీసుకుని ఇంటికి వెళ్ళి వంట చేసేది. ఒక్కొక్కనాడు అమ్మ చేతే వండించేసి గిన్నెలు పట్టికెళ్ళి వాళ్ళింటి దగ్గర పెట్టేవాళ్ళం. ఇక సెలవులొస్తే మా యింట్లోనే వుండిపోయేది. వాణి ఆరోజు మేస్టార్నే వండుకు తినమనేది. తల్లి కోసం ఎక్కడ బెంగ పెట్టుకుంటుందో అని ఏమనేవాడు కాదాయన.

ఇద్దరం పెద్దవాళ్ళ మయ్యాం. ఈ మధ్యలో చాలా మార్పులు జరిగినయ్. మేమిద్దరం పెద్దవాళ్ళమై, చదువులు కట్టిపెట్టి ఇంటి దగ్గరే వుంటున్నాము. "మిగతా పిల్లలు పెద్దవాళ్ళు ఎవరి సంగతి వాళ్ళు చూసుకుంటున్నారు గాని చిన్న పిల్ల! దీని పెళ్ళీ, పేరంటం ఎవరు చూస్తారం"టూ, ఆ వయసులో పిన్నిని చేసుకుని ఇంటికి తెచ్చుకున్నారు మాస్టారు. అందరి కంటే ఎక్కువగా సంతోషించింది అమ్మ పిన్నిని చూసి "అమాయకురాలేనే, వాణిని బాగానే చూసుకుంటుందిలే" అని సంతృప్తిపడింది అమ్మ. నాకు మాత్రం మనసెందుకో చివుక్కుమంది. వాణిని చూసేందుకేనా పిన్నికిపెళ్ళి? ఆమె కేమీ అక్కరలేదా—

పిన్నిని చూస్తే నాన్న రాసే కథల్లోని దేవకన్యకా అనిపించింది. కొత్తలో అవిణ్ణి మళ్ళీ మళ్ళీ చూడాలని తహతహ లాడే దాన్ని గాని మాట్లాడాలంటే మళ్ళీ బెరుగ్గానే వుండేది.

వాణిమాత్రం కొన్నాళ్ళు కొత్తమోజులో పడి మమ్మల్నందర్నీ మర్చేపోయింది. అమ్మ నన్ను తెగ సతాయించేది. "వాణి నొక్కసారి కేకేసుకు రావే మరీ నల్లపూసయి పోయింది" అంటూ. పిలవడానికి వెడితే వాణి "వుండవే పిన్నికి ఎక్క

దేవి వున్నాయో తెలీదూ. నేను లేకపోతే వంటే అవదూ.....''అనేది మహా ఆరిందాలా. కాసేపు కూచోమన్నైనా అనేది కాదు. పిన్ని కూచోమనేది. కాని నాతో కబుర్లు చెబుతూ కూచుందుకు పిన్నికి వీలా? ఇంటోపనీ పాటా ఉగిపోలా? వాణి సరే, ఆవిడ వెనకాలే పనిలేకపోయినా తెగ తిరిగేస్తూ, పిన్నీ పిన్నీ అంటూ ఏవో సలహాలూ సంప్రదింపులతో, ఛార్జి అప్పగిస్తున్న ఆఫీసరు ధోరణిలో సతమత మవుతున్నట్టుండేది, తీరుబడే లేక పాపం. అందుకని ఆట్టే సేపు కూర్చో బుద్ధయ్యేదికాదు. ఇంటికి వచ్చినా మనసు మాత్రం అయస్కాంతంలా ఆటే పిన్ని మసులుతున్న ఆ ఇంటి వెలుపలనే తారట్లాడుతుండేది.

వాణికైనా ఆమోజు ఎన్నాళ్లో నిలవనే లేదు.

ఆతరవాత అదివరకటికంటే ఎక్కువగా మాఇంట్లో తిష్ట వేసేది. ఇదివరలోలా వంటపని గూడా లేదుగా. తండ్రి వచ్చేసరికి తను ఇంటి దగ్గర లేకపోతే కేకలేస్తాడని తెలిసినా పిన్ని సద్దేస్తుందని తెలుసు వాణికి. అందుకని ఆ టైముకి గూడా ఇంటిదగర వుండేది కాదు. పెత్తనాలు సాగించేది.

పిన్ని ఎంత మంచిదంటే, ఆవిడ అమాయకత్వాన్ని అలుసుగా తీసుకుని ఆవిడమీదే ఆధార్టీ చెలాయించేది. వాణి రకరకాలుగా నాన్నతో చెప్పేస్తానంటూ, బెదిరింపు ధోరణిగా ధిమాకీలు చేసేది. ఆవిడ సరే, ఏతప్పు చెయ్యకపోయినా, హడిలి పొయ్యేది. ఆవిణ్ణి చూసి విరగబడి నవ్వేది వాణి.

''ఎందుకు పిన్నీ అంత భయపడతావ్! అసలు చెప్పేందుకు ఏముందని''అంటూ వీపు దువ్వేది తరవాత కొంటెగా.

''భలే దానివే'' అంటూ తేలికగా నిట్టూర్చే పిన్నిని చూస్తే, ఆక్షణంలో ఎక్కడ లేని జాలి పుట్టుకొచ్చేది. వాణి విలిపి తనానికి మండుకొచ్చేది. ఆవిడ ఇవన్నీ మనసులో పెట్టుకునేదే కాదట.

# పిన్ని

ఆ తరువాత వాణి చెప్పేది.

ఏళ్లు గడిచినయ్.

వాణికీ, నాకూ పెళ్లిళ్లయినయ్.

వాణి అత్తవారి టికి వెళ్లింది.

నేను మాత్రం శ్రీవారి చదువు పూర్తి కాని కారణాన ఇక్కడే వుండిపోయాను.

ఈలోపల పిన్నికి ముగ్గురు పిల్లలు పోవడం, రెండుసార్లు ఎబార్షన్లు కావడం జరిగింది. ఎప్పటికప్పుడు 'ఈ సారైనా...' అనుకుంటూ మనసు దిటవు చేసుకుంటూ వుండేది పిన్ని.

ఈసారి వాణివస్తే పిన్ని ప్రసవించేదాకా ఉండిపొమ్మని చెప్పాలి. పంపెయ్యవద్దని పిన్నితో చెప్పాలి. ఎప్పుడూ గలగలలాడుతూ బొంగరంలా చలాకీగా ఉండే వాణి, సంసారంలో పడ్డాక ఇప్పుడెలా వుందో—

మళ్లా నాలుగు రోజులు దాకా పిన్నిగారింటికి వెళ్లటమే పడలేదు.

ఆవేళ మామూలుగా పిన్నిగారింటికి బయలుదేరాను. గేటు తీస్తుంటే మేస్టారి మాటలు వినపడ్డయ్. శనివారంకదూ! ఇంట్లోనే వున్నారు కాబోలు అనుకుంటూ గుమ్మంలోకి అడుగుపెట్టాను. మేస్టారు పిన్ని నేదో కేకలేస్తున్నట్టు తెలిపించి ఆగిపోయా.

''ఇన్నిసార్లు నిన్ను బతిమలాడకుండా నేనే చేయించుకుందును అబ్లడ్ ప్రెషర్ లేకపోతే! ఈ వయసులో ఇంకా పిల్లలంటే సిగ్గేస్తూంది కూడానూ...''మేస్టారి గొంతు కరుగ్గా వినిపిస్తోంది. సన్నగా ఏడుస్తూంది పిన్ని. వెళ్లేందుకు సమయం కాదని వెనక్కి తిరిగా.

మర్నాడు పిన్ని వచ్చింది, నిమ్మకాయకోసమని. వెళ్తూ వెళ్తూ నేను ఇన్నాళ్లు రానందుకు నిష్టూరమాడి, రేపు తప్పకుండా వస్తానని చెప్పించుకుని మరీ వెళ్లింది. నిన్నటి విషాదఛాయల తాలూకు నీడలైనా లేవు పిన్నిలో.

మర్నాడు వెళ్లాను. నవ్వుతూ ఆహ్వానించింది పిన్ని. తను పప్పు రుబ్బుకుంటుంటే నేను గడ్డిపోచ కొరుక్కుంటూ కూచున్నా. పిన్ని ఎడతెరిపి లేకుండా ఏవో చెప్తూనే వుంటుంది. ఈసారి పుట్టబోయే పాపకు ఏవీ దేవుళ్ల పేర్లు కలిపి పెడతానని మొక్కుకుందో చెప్పింది. 'బావుంది కొల్లేటి చేంతాడులా' అని నేనంటే, కిలకిలా నవ్వింది.

మాట్లాడుతున్నసన్న మాటేగాని నామనసంతా మొన్నటి సంఘటన మీదే వుంది. అడగనా వద్దా? కాస్సేపు తటపటాయించి తెగించి మెల్లగా అడిగా.

''మొన్న ఎందుకు పిన్నీ మాస్టారు కేకలేస్తున్నారూ'' ఒకక్షణం తెల్లపోయింది.

''నీకెలా తెలుసూ'' అనుమానంగా అడిగింది.

చెప్పాను.

తలవంచుకుని రుబ్బినపిండి గిన్నెలోకి తీసుకుంటు ''లోపలికి పద'' అంటున్న పిన్ని కంఠంలో కంపం పసికట్టాను. ఎందుకడిగానా అనిపించింది నాకు.

మంచం మీద కూచున్న నాఒళ్లో తలపెట్టి బావురు మంది పిన్ని. అలా పిన్ని ఏడవగా చూడ్డం నాకిది రెండోసారి. మొదటిసారి వాణి అత్తారింటికి వెళ్లినప్పుడు. అప్పుడు నేనూ పిన్నికి భాగస్వామి నయ్యాను. కాని ఇప్పుడలా చెయ్యలేదు. ఏడుస్తున్న పిన్ని తల నిమురుతూ వుండిపోయాను.

ఆక్షణంలో పిన్నికంటే ఎన్నో రెట్లు పెద్దగాన్నని పించింది.

ఆతరువాత తనని తనే సంబాళించుకుంటూ చెప్పింది పిన్ని. ఇక పిల్లలు పుట్టకుండా ఆపరేషను చేయించుకోమంటున్నారట మాస్టారు.

''ఉన్న పిల్లర్ని నీ పిల్లలనుకోరాదా'' అంటారు—నువ్వు చెప్పు— పద్మా ఎంత అప్యాయత చూపినా రక్తం పంచుకు పుట్టిన బిడ్డలవుతారా? ఇంతెందుకు, నన్నింతవరకూ అమ్మా అని పిలవ గలిగారా వీళ్లు? నాబిడ్డలంటూ నాక్కావాలని నేనన్నందుకు పట్టే స్వార్థ పరురాలినంటున్నారు. ఈ ఒక్క కనీసపు కోరిక కోరేపాటి స్వార్థమైనా వుండకూడదా నాలో? చెప్పు పద్మా''.

వెక్కివెక్కి ఏడ్చింది పిన్ని. ఏమని ఓదార్చగలను?


మౌనంగానే నా సానుభూతిని అందచెయ్యగలిగాను. పిన్ని నానుండి పొందగోరింది గూడా అదే.


వాణిని సంక్రాంతికి తీసుకొచ్చారు మాస్టారు.

ఏమీ మారలేదు వాణి. కాకపోతే అదివరకెప్పుడూ సినిమా సంగతులూ అవీ మాట్లాడేది—ఇప్పుడంతా మొగుణ్ణి గురించే—నాకు తెలుసు లోలోపల అమ్మ నవ్వుకుంటోందని.

మాటల సందడిలో అడిగింది అమ్మ 'ఇంకా వుంటావా'ని, ఎప్పటిదాకానో మాకూ తెలుసూ, దానికీ తెలుసు.

''ఆ—తప్పుతుందా?'' వాణి గొంతులో అయి





'మీనా' డీజల్ ఇంజన్
6 H.P. 650 R.P.M.
ఉత్పత్తిదారులు:—
శ్రీ తిరుమలై ఇంజనీరింగ్ కార్పొరేషన్,
191 శివాజీ ఉద్యమ నగర్,
కొల్హాపూర్, (మహారాష్ట్ర)
ఆంధ్రప్రదేశ్‌లో జిల్లావారిఏజెంట్లుకావాలి

ఆపరేషన్ లేకుండా!
స్త్రీసంజీవని నెం. 1
సంతానపరిమితికి

సంతాన పరిమితి సులభము, సాధ్యము. ఈ ఔషధం మన మహాఋషులు ఏనాడో వివరించిన మూలికా యోగములలో నేడత్యవసరము, అతి ముఖ్యమునైన మహాయోగము. ఆరోగ్యభంగ మేమాత్రం లేదు. ఔషధ సేవ 3 రోజులు మాత్రం. పత్యం లేదు. సంతానం కలుగదు. 10 సంవత్సరముల నుండి, వైద్య సోదర, సోదరీమణులచే ప్రశస్తింపబడుచున్న దివ్యౌషధం.

వెల: రు. 10–00 పోస్టేజి ప్యాకింగ్ అదనం.

శ్రీనాగారుస మూలికా కుటీరం,
రైల్వే స్టేషన్ వద్ద,
రామాలయం వీధి, తెనాలి–2.



స్తత మోగింది. అమ్మా నేనూ ఏమీ మాట్లాడలేక పోయాం.

"అయినా కాస్త తెలుసుకోవాల్లెద్దూ—ఈ వయసులో ఇంకా పిల్లలేమిటని నాన్న కయినా వుండాలి— చెల్లెలో, తమ్ముడో అని చెప్పుకోడానికి నాకే సిగ్గేస్తూంది" నిరసనగా అంది వాణి.

"మీనాన్నకయితే వయసయింది—పిల్లలున్నారనుకో—మరి పిన్ని సంగతి?" వూరుకోలేక చటుక్కున అడిగేశాను. చురచురా చూసింది వాణి నావంక.

"ఏం? మేమందరం ఏమయి పోయామని...? ఆవిడకి బిడ్డల గితే వుంటే ఇప్పటిదాకా పుట్టిన నలుసులు దక్కనే దక్కేవాళ్ళు"

దానితో వాదించటం నా కిష్టం లేదు.

"అలా సరిపెట్టుకో గలిగితే దేవతలేనే అమ్మా" అంది అమ్మ మళ్ళీ వేదాంతంలో పడుతూ.

నాలుగురోజులు పోయాక వోరోజు ప్రొద్దున్నే వచ్చేసింది వాణి, మా ఇంటికి మొహం మటమట లాడించుకుంటూ. 'ఏం జరిగిందబ్బా' అనుకుంటున్నా. సరాసరి అమ్మదగ్గరికి వెళ్ళి చెబుతోంది.

"సాయంత్రం బండికి వెళ్ళిపోతున్నా దొడ్డమ్మ గారూ" అంటూ

"అదేం?" ఆశ్చర్యపోయింది అమ్మ.

"ఆవిడ కనడమే ఇష్టం లేని వాళ్ళం పురుళ్ళేం పోస్తాం?" నిష్ఠూరంగా అంది వాణి.

ఏదో జరిగిందన్న మాట... మనసులో దాచుకోలేని సందేహాన్ని బయటకు కక్కింది అమ్మ.

"అసలు మొదలెట్టింది నాన్నగారు— ఆపరేషన్ చేయించుకుంటుంది —కన్న తరవాతగూడా రెణ్ణెల్లు వుండమన్నారు నాన్న. సరేనన్నానట. వంటింటో పిన్ని వింటూనే వుంది. "నేనేమీ ఆపరేషన్ చేయించుకోను. నేను ఒప్పుకున్నట్టే చెబుతారేమిటి?" అంది పిన్ని. దానిమీద నాన్నగారు 'ఎందుకు చేయించుకోవు? ఇప్పటికే నలుగురూ నన్ను చూసి ముందుకొక్క పోయినా వెనక నవ్వుకుంటున్నారు 'ముసలాడికి దసరా పండగని.' నన్నిలా గౌరవంగా బ్రతకనివ్వవా ఏమిటి?' అనడిగారు కాస్త గట్టిగానే. నేనూ వూరుకోలేక, "అవును పిన్నీ ప్రతిసారీ తొమ్మిది నెల్లూ మోసి కష్టపడి కంటమే కాని నీ ఒళ్ళు గుల్ల కావడం మినహా ఏమి మిగులుతుంది? మనసు సరిపెట్టుకోవాలి గాని మేమంతా నీ పిల్లలం కాక పోయామా?" అన్నాను. దానిమీద విరుచుకు పడి పోయిందనుకో. 'మీరూ వో పిల్లలేనా?' అంది 'నాపిల్లయితే నాకిలాటి సలహా ఇచ్చేదా' అంది. తనలో వున్న ఆ ఒక్క కోరికా గూడా నాశనం చేసేసుకుని ఈ ఇంటిల్లపాదికీ చాకిరి చేస్తూ కూచోడం నావల్ల కాదంది. 'అల్లాంటి కోరికలున్న 'మేమే ఉత్త స్వార్థ పరులమ'ంది. ఇది అన్నది, అది అనలేదు అని లేకుండా అన్నీ దులిపేసింది." అని కళ్ళనీళ్ళు పెట్టుకుని, "అంత స్వార్థ పరుల్లం పురుడేం పోస్తాం? ఆవిడంటే ప్రేమాభిమానాలు పొంగుకొచ్చే వాళ్ళ చేతే పోయించుకుంటుందిలే— నేనెందుకూ." అంది ముగిస్తూ.

పిన్నికి ఎవళ్ళూ లేరని దానికి తెలుసు. అందుకే అలా చెప్తోందని మాకూ తెలుసు.

వాణి ఆవేళే వెళ్ళిపోయింది.

పాపం పిన్ని గతేమిటో అనిపించింది.

"ఆ భగవంతుడు వున్నాడు ప్రకియకి. అయినా ఆవిడకి అంత తొందర పనికి రాదులే" అంది అమ్మ.

పిన్నిలో ఎన్ని అగ్ని పర్వతాలు రగులుతున్నాయో అమ్మకి ఎందుకు తెలియదా అనిపించింది నాకు.

ఆవేళ 'నిమ్మకాయపిండి' చేసింది అమ్మ. "పుల్లగా వుంటుంది పిన్నికి కాస్త ఇచ్చిరావే," అంటే బయలుదేరాను. నేను వెళ్ళేసరికి మాస్టారెక్కడికో ప్రయాణమవుతున్నారు. నన్ను చూసి "రారా మంచి శకునం" అన్నారు. అడక్కూడదన్న మాటే మర్చిపోయి, "ఎక్కడి కండోయ్" అన్నాను నవ్వుతూ.

"ఏముంది— వచ్చిన వాళ్ళని తిట్టి వెళ్ళగొట్టంగా ఇకరానివాళ్ళని బ్రతిమలాడి తీసుకు రావడానికి" వ్యంగ్యంగా వోచూపు పిన్ని మీదకు విసిరేసి వెళ్ళిపోయారు మాస్టారు.

పిన్ని కళ్ళల్లో నీళ్ళు తిరగటం స్పష్టంగా కనిపిస్తూనే వుంది. జరిగిన దానికి విచారిస్తూందనటానికి ఆ కన్నీళ్ళే సాక్ష్యం.

బియ్యం ఏరుకుంటూ మెల్లిగా చెప్పింది పిన్ని. కొడుకుని అడిగి కోడల్ని తీసుకురావడానికి వెళ్ళారట మాస్టారు. కాస్సేపాగి మళ్ళీ చెప్పింది— ఆవేళ అన్నిమాటలు అనాలనుకోలేదట తను. తనకా క్షణం ఏదో ఆవేశం ముంచుకొచ్చి అట్లా అనుకోకుండా వాగేశానంది. లేకపోతే చిన్నప్పటినించీ తను పెంచిన వాణిమీద తన కోపమేమిటంది. వాణిని అనవసరంగా బాధపెట్టినందుకు జలజలా కన్నీరుకార్చిందిపిన్ని. వెర్రి పిన్ని! తనలో ఆకోరిక అంతబలంగా వున్నందుకు తనను తానే తిట్టుకుంది. ఈసారైనా భగవంతుడు చల్లగా చూసి, "ఈ పాపనైనా తనకు దక్కిస్తే వచ్చేసారి తప్పకుండా ఆపరేషన్ చేయించుకుంటాను" అని చెప్పింది పిన్ని. పిన్ని మీద జాలేసింది నాకు.

"నీ కోరికలో తప్పేమీలేదు పిన్నీ! అది భగవంతుడిచ్చే వరం..... నువ్వెందుకు చెయ్యిజాపావు అంతే.... ఎవరేమనుకుంటే నీకేం?" అంటూ వోదార్చాను.

"ఎంత గొప్పగా అన్నావే తల్లీ..... నీ కడుపు చల్లగా......" అని ఉప్పొంగి పోయింది పిన్ని.

మర్నాడు పిన్ని వో మూడేళ్ళ అబ్బాయిని వెంటబెట్టుకుని వచ్చింది.

"ఈ పిల్లాడెవరండోయ్" అంది అమ్మ చెయి వేస్తూ.

"మనవడు" అంది నవ్వుతూ.

పిల్లలులేని పిన్నికి మనవడు! నాకు నవ్వాగలా.

అంతకన్న "వీడు నా మనువడు" అని కల్మషం లేకుండా, ఆత్మీయత వెళ్ళబోసుకుంటున్న పిన్నిలోని దేవత నా కళ్ళల్లోకి తొంగిచూచింది క్షణం.

"కోడల్ని తీసుకొచ్చారన్నమాట" అంది అమ్మ

పిన్ని నవ్వేసింది "వుహూ" అంది వుదాసీనంగా. "ఆవిడా నీళ్ళు పోసుకుందట— వేవిళ్ళు — రానందట. ఇక మీరే దిక్కు" అంది పిన్ని జాలిగా.

"మా మాస్టారి ముందాలోచనకి నిదర్శనం....

కితంసారి లక్ష్మిపోయినప్పుడు బెంగపెట్టుకుని ప్రాణంమీదికి తెచ్చుకున్నానట— అందుకని అలా కాకుండా ముందే వీడిని తీసుకొచ్చారు" అంది నవ్వ లేక నవ్వుతూ.

"బాగానే వుంది దీవెన!" కష్టంగా అంది అమ్మ.

కాస్సేపు కూర్చుని వెళ్ళిపోయింది పిన్ని. మాస్టారి ప్రవర్తనకి చాలాసేపు బాధపడ్డాం అమ్మానేనూ.

చెప్పొద్దూ, ఆ తరువాత పిన్నితో నా సాంగత్యం మరీ ఎక్కువయింది. అన్నీ మనసు విప్పి చెప్పేది పిన్ని నాతో. ముఖ్యంగా పుట్టబోయే పాపపైన ఆశ లన్నీ నింపుకున్నట్లు మాట్లాడేది పాపం. "ఈసారి పాపకు నాపాలు ఇవ్వను పద్మా— ఏ గేదెపాలో పట్టి స్తాను. కాస్త బలహీనంగా వుంటే వుందిలే"అనేది. "పాపని నా చేతుల్తో పెంచాలని లేదు. నాచేతులంత మంచివి కావేమో? ఎవరికైనా పది రూపాయలిస్తే ఇంట్లోవుండి చూడరంటావా?" అంటూ వుండేది. రకరకాల గౌను గుడ్డలూ, చొక్కాగుడ్డలూ, కొని అపురూపంగా దాచింది. స్వెట్టరూ, మేజోళ్ళూ అల్లుతూ కూచునేది.

ఆవిడ ఆరాటం చూస్తే నాకెందుకో భయం వేసేది.

కొన్ని రోజులు మామూలుగానే గడిచాయి. ఒక రోజు రాత్రి మాస్టారొచ్చి హడావిడిగా అమ్మని తీసి వెళ్ళారు. పిన్నికి నెప్పులొస్తున్నాయట. ఎదురు చూసిన ముహూర్తం దగ్గర పడుతూంది. నాకింక మిగతారాత్రి నిద్రపట్టలేదు.

తెల్లారగట్ల మాస్టారొచ్చి చెప్పారు. ఆస్పత్రిలో చేర్పించారట. కడుపులోనే బిడ్డపోయిందట. ఆప రేషన్ చేసి తీసేశారట నిర్లిప్తంగా చెప్పారు.

"మనచేతిలో ఏంలేదు ఆభగవంతుడికే దానికోర్కె తీర్చడం ఇష్టంలేదు"అంటున్న మాస్టారి కంఠం ఒణి కింది.

మాస్టార్ని చూసి జాలేసినా, పిన్నిని తల్చుకుంటే గుండె గుభేలుమంది—ఈ ఆఘాతానికి ఎలా తట్టు కుంటుందో?

'కాస్త కాఫీ చేసి ఆస్పత్రికి తీసికెళ్ళమని' చెప్పి వెళ్ళిపోయారు మాస్టారు.

కాఫీ కాస్తున్నానన్న మాటేగానీ, మనసంతా పిన్ని తలపుతో భారమైపోయింది. ఆవిడ పాపాయిమీద పెట్టుకున్న ఆశలూ, అనుకుని మురిసిన మాటలూ తల్చుకున్న కొద్దీ దుఃఖం పొంగుకొచ్చింది.

ఇంకా ఆస్పత్రికి బయలుదేరనే లేదు. వచ్చివడ్డది అమ్మ. పెద్ద ఆపత్తేదో వచ్చినట్టు చలించిపోతున్న అమ్మను చూస్తూంటే, మాస్టారు చెప్పిన సంగతికే ఇంత బాధపడుతూందన్న నమ్మకం నాకు కలగలేదు. కీడును శంకిస్తున్న మనస్సుతో "ఏమయిందమ్మా?" అని అడిగాను.

"అయిపోయిందమ్మా— అయిపోయింది. పిన్ని చచ్చి పోయింది." బావురుమంది అమ్మ.

స్తంభించిపోయాను నేను...... ఏదో ఆపద అను కున్నాను గాని ఇంత దారుణం జరుగుతుందనుకోలేదు. కన్నీళ్ళు కాలువలు కట్టేనయ్యి. కాస్సేపు ఇద్దరం మాట్లాడలేక పోయాం. అమ్మే వెక్కిళ్ళ మధ్య చెప్పింది.

ఆపరేషన్ చేసి బిడ్డను తీసేసేటప్పుడే తప్పని సరిగా ఇక బిడ్డలు పుట్టకుండా చెయ్యాలిసి వొచ్చిం దట. లేకపోతే పెద్ద ప్రాణానికే ముప్పంట. స్పృహ వచ్చిన పిన్నికి ఆ విషయం తెలిసిందట! పిన్ని మాస్టార్ని చూస్తూనే ఆవేశంతోనూ, ఆవేదనతోనూ మెలికలు తిరిగి పోయిందట. ఆక్షణంలో ఆమెనెవరూ పట్టు కోలేక పోయారట. ఎంతసేపూ మాస్టార్ని చూసి "మీరే— మీరే ఇలా చేయించారు నాకు తెలుసు— నాకు తెలుసు" అంటూ వూగిపోయిందట. తనుగాని డాక్టర్లుగాని అసలు సంగతి ఎంతచెప్పినా వినిపించు కోలేదుట. కాస్సేపటిలోనే పిన్ని ఈ లోకంనించే వెళ్ళిపోయిందట"—వెక్కివెక్కి ఏడ్చింది అమ్మ.

"ఆసంగతి తెలియక పోయినా, మాస్టారిమీద ఆ అనుమానం అంత బలీయంగా కలగకపోయినా పిన్ని బ్రతికేదే" అంటుంది అమ్మ.

కాని ఎలా నమ్ముతుంది పిన్ని. ఆదినించీ ఆమె మాతృత్వాన్ని అర్థం చేసుకోని ఇంట్లో, తన కడుపు పంట కోసం తానుపడే తపనకి విలువ కట్టలేని ప్రపంచంలో, తమ స్వార్థాలతో తన మనస్సు కలుషం చేసి వదిలిపెట్టిన మనుషులమధ్య, తనకి అన్యాయం జరగలేదన్న నమ్మకమేమిటి?

అందుకే ఈ నమ్మరాని మనుష్యుల మధ్యనించి శాశ్వతంగా వెళ్ళిపోయింది పిన్ని.

మాస్టార్ని చూస్తూంటే జాలేస్తున్నా ఒక్కొక్క ప్పుడు చేతులారా పిన్నిని చంపిన హంతకు డనిపిస్తుంది నాకు. ●